


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**ఆ రాత్రి ఆమె** చాలాసేపు పచార్లు చేస్తూ నిద్రపోలేదు. ప్రొద్దున్న ఆరింటి వరకూ మెలకువ గానే ఉంది. ఏడవుతూండగా తిరిగి ఫోన్ చేసి, 'హలో' అని అట్నుంచి వినిపించగానే ''చూడండి. నిన్న రాత్రి మీరు నన్ను ఘోరంగా అవమానించారు. ఒక పేషెంట్ మిమ్మల్ని నమ్మి అన్నీ మీకు చెప్పుకుంటే...'' అంటూ ఏదో చెప్పబోతూంటే, అట్నుంచి ఆయన–

''అమ్మాయ్, నువ్వేం మాట్లాడుతున్నావో నాకేం అర్థం కావటం లేదు. బొంబాయి నుంచి నేను ఇప్పుడే వస్తున్నాను'' అన్నారు.

మిన్ను విరిగి మీద పడ్డట్టు ఆమె నిశ్చేష్టురాలైంది. ''నేను మాట్లాడుతున్నది సైకియాట్రిస్టు అశ్వత్థామతోనేనా?''

''అవును.''

''నేను నిన్న పంపిన బ్యాంకు డ్రాఫ్టు...''

''బల్ల మీదుంది. ఎవరు పంపారా అని ఇప్పుడే అనుకుంటున్నాను.''

క్రితం రాత్రి తనతో మాట్లాడిన గొంతుకీ, ఈ కంఠానికీ తేడా అప్పుడు గమనించింది. ఆవేశమో, అవమానమో తెలియని స్థితిలో ఆమె పెదవులు వణకసాగాయి. చెప్పుకుంటే నవ్వొచ్చేలా అతనెవరో తనని చాలా బాగా ఫూల్ చేశాడు.

ఆమె కఠినంగా, చాలా స్పష్టంగా చెప్పింది. ''నిన్న రాత్రి మీ లాండ్–ఫోన్‌లో నాతో ఎవరో మాట్లాడారు. వాడెవరో గానీ వాడికి చెప్పండి. 'అతను చేసిన అవమానానికి నేను అతన్ని వదలిపెట్టను. జీవితంలో మళ్ళీ ఇటువంటి మోసాలు ఇంకెప్పుడూ చేయకుండా పాఠం చెపుతాను.''

''అమ్మాయ్... నువ్వెవరు? అసలిదంతా...'' అట్నుంచి ఆయన మాట్లాడుతూనే ఉన్నాడు. ఫోన్ పెట్టేసింది. ఆమె రక్తం సలసలా మరగసాగింది. అవతలి వ్యక్తి ప్రొఫెషనల్ అనుకుని చూసినదంతా పూస గుచ్చినట్టు దారిన పోయే దానయ్యకు చెప్పుకుంది. అఖండ మేధావిలా వాడు అట్నుంచి సలహాలిస్తుంటే చెవిలో పువ్వు పెట్టుకుని విన్నది. మధ్య మధ్యలో అతను నవ్విన నవ్వుకి అర్థం ఇప్పుడు తెలుస్తోంది.

రాత్రి తాలూకు సంఘటన తల్చుకున్న కొద్దీ ఆమె వళ్ళు మండుతోంది. ఇన్ని కోట్లకు అధిపతిని, పరిశ్రమలకు అధికారిని, కనుసైగతో వందమందిని శాసించగల వ్యక్తిని...

అంతగా మోసం చేసిన ఆ వ్యక్తి ఎవరో... పాపం. ఇంకెప్పుడూ ఎవరి మీదా ప్రాక్టికల్ జోకులు వేయకుండా పాఠం నేర్చుకుంటాడు..!

ఆమె ఫోన్ దగ్గరకు లాక్కొని 'డయల్' చేయసాగింది.

''డాక్టర్ అశ్వత్థామ హియర్'' అని వినిపించగానే మాట్లాడటం ప్రారంభించింది.

– 2 –

**''కార్తీక్.** ఇలారా లోపలికి'' ఇంటర్‌కమ్‌లో పిలిచాడు డాక్టర్ అశ్వత్థామ. అతడి వయస్సు యాభై దాటి ఎనిమిది సంవత్సరాలవుతున్నది. ముప్పయి ఏళ్ళ వాడిలా కనబడటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు. గొప్ప తెలివితేటలున్నట్టు మాట్లాడటానికి ప్రయత్నంచేస్తూ ఉంటాడు. లోపలంతా 'డొల్ల' అని తెలియని పేషెంట్లు మోసపోతూ ఉంటారు. రచన ద్వారా కాకుండా పది సంవత్సరాల క్రితపు పాత ఫోటోల ద్వారా పాఠకుల్ని ఆకట్టుకునే రచయిత(త్రు)ల జాణతనం అతనిలోనూ కనబడుతుంది. మందుల కన్నా మాటల ద్వారా పేషెంట్ల నించి ఫీజులు లాగుతాడు.

కార్తికేయ వచ్చి నమ్రతగా నిలబడ్డాడు.

''నిన్న రాత్రి ఎవరో పేషెంట్ ఫోన్ చేస్తే ఇష్టం వచ్చినట్టు వాగావుట.''

కార్తికేయకి విషయం అర్థమయింది.

నెమ్మదిగా అన్నాడు. ''నిన్న మధ్యాహ్నం నాకు ఒక బ్యాంకు డ్రాఫ్టు, చిన్న చీటీ వచ్చాయి సార్. ఆ చీటీలో 'తొమ్మిదింటికి ఫోన్ చేస్తాను' అని ఉంది. అందులో వ్రాసినట్టుగానే పేరు చెప్పకుండా ఒకావిడ ఫోన్ చేసింది. 'డాక్టరుగారు లేరు' అని నేను చెప్పబోయేటంతలో ఆవిడ తన బాధ చెప్పటం ప్రారంభించింది.''

''అందుకని నువ్వే ఆవిడ బాధ అంతా విని సలహా ఇచ్చి పారేశావ్. అవునా'' రంకె పెట్టాడు.

''వినక పోతే ఫీజు వెనక్కి తీసుకోననీ, ఏ అనాథ శరణాలయానికో ఇచ్చెయ్యమనీ చెప్పింది''.

''ఈ క్లినిక్ డాక్టర్‌వి నువ్వా? నేనా?''

''నిశ్చయంగా మీరేనండి. నేను కేవలం ఆఫీస్‌బాయ్–కమ్–రిసెప్షనిస్ట్–కమ్–కాఫీ కుర్రాడిని''

''మరి అటువంటప్పుడు ఎవరన్నా ఫోన్ చేస్తే, నువ్వే డాక్టర్‌లా మాట్లాడేసెయ్యటమేనా ఇడియెట్... స్కౌండ్రల్?''

చివరి పదాలకి కార్తికేయ మొహం వాడిపోయింది. అయినా వాతావరణాన్ని తేలిక చేయటానికా అన్నట్టు – ''దీనికి రెండు కారణాలున్నాయి సర్. మొదటిది– ఆవిడ నేను చెప్పే మాటలు వినిపించు కోకపోవటం, రెండోది– ఆవిడ తను పేషెంట్‌ని కాననీ, కేవలం తను చెప్పేది వింటే చాలుననీ అనటం!'' అన్నాడు.

''నువ్వేమన్నా క్రిష్టియన్ ఫాదర్‌వా ఆవిడ చెప్పేదంతా వినడానికి?''

''కాద్సార్. విలువలో కనీసం చిన్న ఫాదర్‌ని కూడా కాను.''

''షటప్! ఆవిడ చాలా కోపంగా 'అంతు చూస్తాన'ని ఫోన్ పెట్టేసింది. కంఠం బట్టి ఆవిడకి చాలా పలుకుబడి ఉన్నట్టు తెలుస్తోంది. ఇంతకీ ఆవిడ ఏం చెప్పింది?'' కుతూహలంగా అడిగాడు.

''చెప్పకూడనిదే చెప్పింది సార్''

ఆ మాటకి అశ్వత్థామ మరింత ఉత్సుకతతో ముందుకు వంగి ''ఏం చెప్పింది?'' అన్నాడు. కార్తికేయ మరింత సస్పెన్సుగా, ''ఆ విషయం మనకు తెలిసిందనే ఆవిడ మరింత కంగారుపడుతోంది'' అన్నాడు. అశ్వత్థామ ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచి నిలబడి, ''ఏం చెప్పింది? ఏం చెప్పింది? ఆ విషయం చెప్పు'' అన్నాడు బి.పి. పేషెంటులా.

''వెన్నెలరాత్రి చెట్ల వెనుక ఒక మగాడు, స్త్రీ కలిసి ఉండగా చూసిందట. ఆ వయసులో రక్త ప్రసరణం హెచ్చటం పోయి, ఏదో సర్కస్ చూసినంత ఆనందంగా ఉన్నదట. అదేమన్నా మానసిక వ్యాధా? అని అడిగింది.''

''నువ్వేమన్నావ్?''

''కార్లోసర్కోమా ఆఫ్ మెడ్యూలా సిండ్రోమ్'' అన్నాను.

''అదేం పేరు? నేనెక్కడా వినలేదే?''

''నేనూ వినలేదు. కానీ జబ్బు పేరు భారీగా ఉంటే ఫీజు బాగా వసూలు చెయ్యవచ్చని మొన్నే మెడిసిన్ పూర్తి చేసిన మీ అబ్బాయికి మీరు చెపుతూంటే విన్నాను.''

''షటప్! నిన్ను వెంటనే డిస్మిస్ చేస్తున్నాను.''

కార్తికేయ నెమ్మదిగా ''ఇది అన్యాయం సార్'' అన్నాడు.

''ఒక పేషెంటు బాధ్యతాయుతమైన డాక్టర్‌ని నమ్మి తన రహస్యాలు చెప్పుకుంటే, దాన్ని నువ్వు వింటావా..! నా కొచ్చిన ఫోన్ నువ్వు మాట్లాడటానికి ఎంత ధైర్యం?''

''మా పక్కింటి అమ్మాయి నన్ను 'అన్నయ్యా' అంటుంది. మొన్న వాళ్ళ అమ్మ కి బాలేదని తను నాకు ఫోన్ చేస్తే 'నేనే కార్తీక్' నని చెప్పి గంటసేపు మీరు మాట్లాడలేదా సార్... ఈ వయసులో?'' అన్నాడు చివరి పదాన్ని కాస్త దిగమ్రింగుతూ.

అశ్వత్థామ గతుక్కుమని ''వ్వాట్'' అన్నాడు.

''పైగా అదేమిటని నేనడిగితే, 'ఇదంతా సైకాలజీ స్టడి లేవోయ్, నీకు అర్థం కాదు. డాక్టర్లకీ, రైటర్లకీ ఇదంతా చాలా అవసరం' అన్నారు కూడా. పైగా ఆ అమ్మాయిని మరింత 'స్టడీ' చేయటం కోసం డిన్నర్‌కి కూడా పిలిచార్ట.''

అశ్వత్థామ కుర్చీలోంచి విసురుగా లేని నిలబడ్డాడు. కార్తీక్ కొనసాగించాడు. ''పాపం వాళ్ళింట్లో మగదిక్కులేదు. వాళ్ళమ్మకి కడుపు నొప్పి వచ్చిందంటే 'నేనూ డాక్టర్నే. ఇక్కడికి తీసుకురా' అన్నార్ట.''

''గెటౌట్. వెంటనే బయటకు నడు'' అరిచాడు అశ్వత్థామ.

''సార్...'' అన్నాడు కార్తికేయ. ''నిన్న రాత్రి నాతో మాట్లాడిన కోటీశ్వరురాలు ఎవరో, ప్రొద్దున్నే మీ అంతు తేలుస్తాననగానే, మీరీ నిర్ణయం తీసుకుంటారని నాకు తెలుసు. చిన్న ఆపదకే విపరీతంగా భయపడిపోయి, మనల్ని మనం రక్షించుకోవడం కోసం అవతలి వాళ్ళని బలిపెట్టే సైకాలజీని ఏమంటారో తెలుసా సార్? ఎస్టీ ఎస్సెఫ్ కాంప్లెక్సు.''

కోపంతో అశ్వత్థామ రొప్పుతున్నాడు. ''నా జబ్బేమిటో నాకు తెలుసు. నువ్వేం చెప్పనక్కరలేదు.''

కార్తికేయ నవ్వి ''ఏం తెలుసు మీకు? ఎస్టీ ఎస్సెఫ్ అంటే ఏమిటో చెప్పండి చూద్దాం'' అన్నాడు.

''నువ్వు వెళతావా? పోలీసుల్ని పిలవమంటావా?''

కార్తికేయ వెంటనే కదలలేదు. ''ఆర్నెల్లు మీ క్రింద పనిచేశాను. మీ సైకాలజీ చెప్తా వినండి. నిన్న ఆ అమ్మాయి ఫోన్‌కాల్ మీరు గానీ అందుకుని ఉంటే, రకరకాల వ్యాధుల పేర్లు పెట్టి, చివరికి ఆ అమ్మాయి మిమ్మల్ని కలుసుకునేలా చేసేవారు. సైకాలజిస్టు దగ్గర్నుంచి గైనకాలజిస్టు దగ్గరకు వెళ్ళేలా చేసి ఉండేవారు. డాక్టర్‌ని కాకపోయినా నిజాయితీగా, ఆ అమ్మాయికి ఏ వ్యాధీ లేదని చెప్పాను. ఫలితంగా ఉద్యోగం పోగొట్టుకున్నాను. నో రిగ్రెట్స్'' అని గుమ్మం దగ్గరకు వెళ్ళి తలుపు తీసి, ఆగి వెనక్కి తిరిగి, నెమ్మదిగా అన్నాడు –

''ఎస్టీ ఎస్సెఫ్ అంటే షాడో థ్రెడ్ – స్నేక్ ఫియర్'' అంటూ తలుపు దగ్గరగా వేసి బయటకు వచ్చి, అక్కడ వరండాలో కూర్చున్న పేషెంట్స్‌ని జాలిగా చూసి, మనస్ఫూర్తిగా అభినందించి అతడు బయటకు నడిచాడు.

''ఏమిటి భాయ్, అన్నిసార్లు లెక్కపెడుతున్నావ్?'' అడిగాడు ఉస్మాన్.

''ఉద్యోగం పోయింది. చేతిలో ఉన్న డబ్బుతో ఎన్ని రొట్టెలు తినొచ్చా, ఎన్ని కప్పుల 'టీ' తాగొచ్చా అని.''

వాళ్ళిద్దరూ స్నేహితులు. ఇంటికి ఫర్లాంగు దూరంలో ఉన్న హోటల్లో కూర్చుని ఉన్నారు. కార్తికేయ దూరంగా కనపడుతున్న తన ఇంటి వైపు చూస్తూ ''ఈ నెల రూమ్ రెంట్ కట్టాలి'' అన్నాడు స్వగతంగా.

''నిన్నటి వరకూ జీతం...''

''ఇచ్చే పొమ్మన్నాడు.''

''ఎందుకు అంత అకస్మాత్తుగా తీసేశాడు?''

''ఒక అమ్మాయి వచ్చింది. నేనే డాక్టర్‌నని చెప్పి, పరీక్ష చెయ్యాలన్న మిషతో రేప్ చేశాను. ఆ అమ్మాయి మన ముఖ్యమంత్రి రెండో భార్య మూడో కూతురట. ఆయన రౌడీల్ని పంపి క్లినిక్‌ని ధ్వంసం చేయిస్తాడేమోనన్న భయంతో నాకు ముందే ఉద్వాసన పలికాడు మా డాక్టర్‌గారు.''

''నేను చచ్చినా నమ్మను. అయినా నువ్వు జోక్ కూడా అంత సీరియస్‌గా చెప్తావేమిటి భాయ్''

''నా ఉద్యోగం పోవడం జోకా? రేపటి నుంచీ పస్తులుండబోవటం జోకా?''

''నెల జీతం ఇచ్చాడన్నావ్, ఏం చేశావ్?''

''ఖర్చు పెట్టేశాను.''

''ఒక్కరోజులో ఏం ఖర్చు?''

''అకౌంట్ వ్రాయలేదు. గుర్తులేదు.''

టీ తాగుతూ భావరహితంగా సమాధానాలు చెపుతున్న కార్తికేయ వైపు ఉస్మాన్ చాలాసేపు చూస్తూ ఉండిపోయాడు. కార్తికేయ టీ ముగించాడు. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ''నువ్వు చాలా గొప్పవాడివి భాయ్'' అన్నాడు ఉస్మాన్.

''చాలా గొప్ప రహస్యం కనుక్కున్నావ్. ఎందుకట?'' కార్తికేయ నవ్వాడు.

''నిన్న రాత్రి మీ ఇంటిగలావిడకి మళ్ళీ కడుపు నొప్పి తిరగబెట్టి, ఆస్పత్రిలో జేర్పించాల్సి వచ్చిందనీ, ఆ డబ్బు నువ్విచ్చావని రజియా సిస్టర్ చెప్పింది.''

''అందుకని గొప్పవాడిని అయ్యానా?''

''లేదు భాయ్. ఒక కోటీశ్వరుడు వెయ్యిరూపాయలు దానం చేసినా అది పదిమందికీ తెలియాలనుకుంటాడు. రేపు ఏమవుతుందన్న ఆలోచన లేకుండా చేతిలో డబ్బంతా ఖర్చుపెట్టావ్. అది కూడా గొప్ప అని అనను. కానీ ఆ విషయం నాకు చెప్పటంలో నువ్వు ఏమీ ఇంటరెస్టు చూపించలేదు. అదీ గొప్ప...! మన గొప్పతనం అవతలివాళ్ళు గుర్తించాలని అనుకోకుండా ఉండడమే అన్నిటికన్నా పెద్ద గొప్పతనం. ఒక్క విషయం చెప్పు భాయ్. డబ్బంటే 'వెంట్రుక' అనే ఫీలింగ్ నీకెలా వచ్చింది?''

''అదేం తెలుగు ఉస్మాన్? కాస్త బాగా మాట్లాడలేవా?''

''మాట మార్చకు భాయ్. జవాబు చెప్పు.''

మధ్యాహ్నం ఎండ మాడు బ్రద్దలు కొడుతోంది. కడుపులో పడిన చిన్న రొట్టెముక్క ఆకల్ని మరింత పెంచింది. రెండు చేతులూ జేబుల్లో పెట్టుకుని అతడు నడక సాగిస్తూ, ఉస్మాన్ తో అన్నాడు. ''నా తండ్రి ఒక జమిందారు ఉస్మాన్. ఆ రోజుల్లోనే కోటీశ్వరుడు. ఒక ఉంపుడుగత్తె మాయలో పడి ఆస్తంతా ఆమెకు వ్రాసేశాడు. అమ్మ పది సుదీర్ఘమైన సంవత్సరాలు దాదాపు బిచ్చమెత్తి నన్ను చదివించింది. ఒక్క పైసా నాన్న నుంచి తీసుకోలేదు. రోగాలతో బికారిలా తిరిగొచ్చిన నాన్నని అమ్మలా ఆదరించింది. నిజమైన ప్రేమంటే ఏమిటో అప్పుడే నాకు తెలిసింది ఉస్మాన్.'

''నువ్వేం చదువుకున్నావ్?''

''మా అమ్మా నాన్నల జీవితాన్ని''

''కొంచెం అర్థమయ్యేలా చెప్పు భాయ్...''

‘‘డబ్బుతో ప్రేమని కొనుక్కోవచ్చుననుకున్న నాన్న హీనంగా బ్రతికాడు. ప్రేమతో మనిషిని ఆకట్టుకోవచ్చునని అనుకున్న అమ్మ మహారాణిలా బ్రతికింది. జీవితంలో మనిషి నేర్చుకో దగ్గ పాఠం ఇంతకన్నా వేరే ఉంటుందా ఉస్మాన్?’’

ఉస్మాన్ తటపటాయించి, ‘‘పూర్వకాలం జమీందార్లకి ఇవన్నీ మామూలే అనుకుంటాను. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు’’ అన్నాడు.

‘‘ఆ రోజుల్లో మా దివాణంలో రోజూ యాభై విస్తర్లు లేచేవి. వంట ఏర్పాట్లు అమ్మ దగ్గరుండి చూసేది. ఆ సమయంలో ఒకసారి చీరంటుకుని మొహంతో సహా వళ్ళంతా కాలిపోయింది. అమ్మ సంసార సుఖానికి పనికి రాకపోవటంతో అప్పటి వరకూ ప్రేమగా ఉన్న నాన్న పక్కదారి పట్టాడు. ప్రియురాలి చిన్న పిలుపుకోసం ఆస్తంతా ఖర్చుచేసి బికారి అయ్యాడు.’’

‘‘మాలో అయితే రెండు పెళ్ళిళ్ళు నేరం కావు.’’

“నేను మతం గురించి చెప్పటంలేదు. మనస్తత్వం గురించి చెపుతున్నాను” కార్తికేయ సాలోచనగా అన్నాడు. ‘‘... జీవితంలో ఒకర్ని ప్రేమించాక మరొకరి వైపు దృష్టి ఎలా పోతుంది ఉస్మాన్? అవతలి వారికి కాస్త రుగ్మత రాగానే ప్రేమ అంతమై పోతుందా? ఏమో – నాకయితే ప్రేమకున్న విలువ ఇంక దేనికీ లేదనిపిస్తుంది. అందుకే డబ్బంటే అసహ్యం నాకు.’’

శ్రీకళ్యాణి టేబిల్ మీద ఫైల్సు పడేస్తూ, ‘‘ఈ ప్రపంచంలో డబ్బు తప్ప మరేమీ లేదనీ, డబ్బు కోసం మనిషి ఎన్ని నీచాలయినా చేస్తాడనీ ఇదుగో... ఇన్ని రిపోర్టులు రుజువు చేస్తున్నాయి. అవునా’’ అంది.

సిగ్మా డిటెక్టివ్ ఏజెన్సీస్ డైరెక్టర్ ప్రతాపరెడ్డి మాట్లాడలేదు. శ్రీకళ్యాణి తాలూకు వివిధ కంపెనీల్లో పనిచేసే అధికారుల చీకటి (తలుపు వెనుక) చర్యల మీద ఆయన ఆమెకి స్వయంగా ప్రతి మూడు నెలల కొకసారి రిపోర్టు అందజేస్తాడు. దాదాపు పదిమంది ఉన్నతాధికారులు ఆమె కంపెనీలని ఏ విధంగా మోసం చేసి సొంతంగా లాభపడుతున్నదీ ఆ రిపోర్టుల్లో ఉన్నది. వాటిని పక్కన పడేస్తూ, ‘‘మీరు నాకో విషయం ఇన్వెస్టిగేట్ చేసి పెట్టాలి’’ అన్నదామె.

‘‘ఏమిటి?’’

‘‘సైకియాట్రిస్టు అశ్వత్థామ తెలుసుగా?’’

‘‘ఆ ముసలోడా. పేరు పక్కన నాలుగు అమెరికన్ డిగ్రీలు పెట్టుకుని భారీగా ఫీజులు వసూలు చెయ్యటం తప్ప వాడికి ఓనమాలు తెలియవు.’’

‘‘అతని గురించి మనకు అనవసరం. అతని దగ్గరో అసిస్టెంటు ఉంటాడు. డాక్టరు లేనప్పుడు ఆఫీసు ఫోనులు అందుకుంటూ ఉంటాడు. రాత్రిళ్లు బహుశా ఆ క్లినిక్‌లోనే ఉంటాడని అనుకుంటాను. పేరుతో సహా అతని గురించి మొత్తం వివరాలు కావాలి.’’

'ఎందుకు' అని అడగలేదు ప్రతాపరెడ్డి. సిగ్మా ఏజన్సీ ఇటువంటి విషయాల్లో వివరాలు ఎక్కువ అడగదు. ఫీజు అడుగుతుంది.

''వీలైనంత తొందరలో ఆ వివరాలన్నీ పంపిస్తానమ్మాయ్'' అంటూ ప్రతాపరెడ్డి లేచాడు. అతను వెళ్ళిపోయాక ఆమె ఫైలు తీసుకుంది. తన కంపెనీలో పని చేస్తున్నవాళ్లు కొందరు రహస్యంగా ఎంతెంత సంపాదిస్తున్నదీ చెప్పే సీక్రెట్ ఫైలు. వాళ్ళ అవసరం తీరే వరకూ ఆగి, ఆపై ఒకరొకర్నీ నెమ్మదిగా తొలగించాలి.

దూరంగా ప్రహరీ గోడ అవతల ఎవరో స్త్రీ ఏడుస్తోంది. ప్రతి రాత్రీ ఆమె మొగుడు డబ్బుల కోసం చితకబాదుతాడు. అయినా ఆమె అతడితోనే ఉంటుంది. ఒకరోజు ఎదురింటి కాలేజి కుర్రాడి గదిలో పట్టుబడింది. గొడవైంది. అయినా కలిసే ఉంటున్నారు.

'ఈ ప్రపంచంలో మానవ సంబంధాలన్నీ స్వార్థపూరితాలే' అని ఆమె మళ్లీ అనుకుంది.

3

**కార్తికేయ** సిగ్మా ఏజెన్సీకి చేరుకునేసరికి పదిన్నర అయింది. బయట వరండాలో దాదాపు పాతికమంది దాకా యువకులు కూర్చుని ఉన్నారు. పిలిచింది ఆఫీస్‌బాయ్ ఉద్యోగానికే అయినా, అందులో సగం మంది గ్రాడ్యుయేట్లలా కనపడ్డారు. అతడు కూడా వాళ్ళతో చేరి లోకాభిరామాయణం మొదలు పెట్టాడు.

''మీరేం చదువుకున్నారు?'' పక్క మనిషితో సంభాషణ కలుపుతూ అన్నాడు కార్తికేయ.

''గ్రాడ్యుయేట్‌ని''

మరో అయిదు నిమిషాల సంభాషణ జరిగాక కార్తికేయ అన్నాడు ''నేనేదో ఇంటర్వ్యూ గురించి చదివాను. ఇలాగే చాలామందిని పిలుస్తారు. అందరూ వచ్చి కూర్చుంటారు. గోడకి ఒక మూల సాలెగూడు ఉంటుంది. వాళ్ళలో ఒకడు వెళ్ళి దాన్ని దులిపేస్తాడు. అతడికి ఉద్యోగం వస్తుంది.''

పక్కవాడు ఆశ్చర్యంగా ''ఎందుకొస్తుంది?'' అని అడిగాడు.

''తను పని చేయబోయే ఆఫీసు నీట్‌గా ఉండాలని, ఉద్యోగం రాకముందు నుంచే అనుకున్నాడు కాబట్టి.''

వీళ్ళిద్దరి సంభాషణ వింటున్న మూడో అభ్యర్థి ఏదో పని ఉన్నట్టు అక్కణ్నుంచి వెళ్ళి చాలా క్యాజువల్‌గా దూరంగా బల్ల పక్కన పడి ఉన్న న్యూస్ పేపర్లు తీసి సరిగ్గా సర్దాడు.

''అతడు సాలెగూడు తీసెయ్యటం యాజమాన్యంలో ఎవరయినా చూశారంటారా?''

''ఆ ఇంటర్వ్యూ కొచ్చిన వాళ్ళలోనే యాజమాన్యం తాలూకు మనిషి ఉన్నాడు'' అన్నాడు కార్తికేయ. పక్కవాడు అదిరిపడి చూసి ''ఇక్కడా అలాగే జరుగుతూ ఉండి ఉంటుందంటారా?'' అని అడిగాడు.

''ఏమో! డిటెక్టివ్ ఏజెన్సీ కదా. మనలోనే ఎవరేపని చేస్తున్నారా అని మారువేషాలతో ఇక్కడ తిరుగుతూ ఉండవచ్చు'' అని చెప్పి వెళ్ళిపోయాడు జేబులో రూపాయి పావలా ఉంది. ఆఖరి రొట్టె తిని, టీ తాగి దాదాపు గంట తరువాత వచ్చాడు. నడుస్తూ ఊహల్లోకి వెళ్ళాడు.

*సిగ్మా డిటెక్టివ్ ఏజెన్సీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి రివాల్వింగ్ చైర్‌లో గిర్రున తిరిగాడు. ''నీ తెలివితేటలకి నిజంగా అభినందిస్తున్నాను. నయాపైసా ఖర్చు లేకుండా నా ఆఫీసు నీట్‌గా మారిపోయేలా చేశావ్. నిన్ను వెంటనే నా సిగ్మా డిటెక్టివ్ ఏజన్సీలో నాలుగొందల రూపాయల జీతం మీద ఆఫీసు బాయ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నాను.''*

కాలికి రాయి కొట్టుకోవడంతో ఈ లోకంలోకి వచ్చాడు. ఎత్తయిన సిగ్మా ఏజెన్సీస్ భవనం దాదాపు నిర్మానుష్యంగా ఉంది. అతడికి ఆశ్చర్యం వేసింది. గంటలో అంతమంది అభ్యర్థుల ఇంటర్వ్యూ అంత తొందరగా ఎలా పూర్తయిందా? అని.

నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు. రిసెప్షనిస్టు కుర్చీ ఖాళీగా ఉంది. ఏ పని మీద వెళ్ళిందో తెలీదు. ఎవరినయినా అడుగుదామనుకున్నాడు కానీ, నౌఖర్లు లేకేగా ఈ ఉద్యోగానికి తమని పిలిచారని గుర్తొచ్చింది. మరో అయిదు నిముషాలు అలాగే నిలబడ్డాడు. ఏం చెయ్యాలో తోచలేదు. ధైర్యంచేసి డైరెక్టర్ అని వ్రాసి ఉన్న తలుపు తెరుచుకుని లోనికి ప్రవేశించాడు.

లోపల ప్రతాపరెడ్డి అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. అతడు విసుగ్గా కోపంగా ఉన్నట్టు చూడగానే తెలిసింది.

''ఎవర్నువ్?'' అని అడిగాడు.

''ఇంటర్వ్యూ కొచ్చాను సార్. బయట ఎవరూ లేరు'' నమ్రతగా అన్నాడు.

''పదకొండింటికి రమ్మంటే ఇపుడా రావటం?''

''పదకొండింటికే వచ్చాను సార్. చాలామంది ఉన్నారు. 'లిస్టు' లాటిదేమీ లేదు. కాబట్టి నా వంతు వచ్చేసరికి ఎలాగైనా ఒక గంట పడుతుందనుకున్నాను.''

''ఓహో, టైమ్ వాల్యూ అంత తెలిసినవాడివి అన్నమాట.''

కార్తికేయ మాట్లాడలేదు. అంతలో ఫోన్ మ్రోగింది. ప్రతాపరెడ్డి వెళ్ళి కుర్చీలో కూర్చుని రిసీవర్ ఎత్తి 'హల్లో' అన్నాడు. అట్నుంచి వస్తున్న స్వరం వినగానే ఆయన కుర్చీలో కాస్త సర్దుకుని కూర్చుని ''చెప్పమ్మా కళ్యాణి'' అన్నాడు.

అట్నుంచి ఏం వినిపించిందో తెలీదు. ప్రతాపరెడ్డి ముందుకు వంగాడు. ''నువ్వు చెప్పాక ఇంకా ఇంత ఆలస్యమా అమ్మా? ఆ డాక్టరు గురించి మావాళ్ళు మొత్తం రిపోర్టు తయారు చేశారు. ఆ కవరు నా టేబిల్ మీద ఉంది. అతడికి సెక్రటరీలంటూ ఎవరూ లేరు. ఒక కుర్రాడు ఎవరో ఉంటే, వాడిని నిన్నే ఉద్యోగంలోంచి తీసేశాడు. ఆ డాక్టరు... ఊఁ... చెప్పమ్మా ఆ ఏరియా ఇన్‌స్పెక్టర్ మనవాడే. లోపల తోయించి ఆ హాస్పటల్ పర్మనెంట్‌గా మూయించెయ్యమంటావా?''

అట్నుంచి ఆమె ఏదో చెపుతోంది.

''ఓహో మీక్కావల్సింది ఆ అసిస్టెంటా? డాక్టర్ కాదన్నమాట. ఆ కుర్రాడి సంగతి ఇన్వెస్టిగేట్ చెయ్యమని మా వాళ్ళకి చెపుతాను.''

కార్తికేయ వింటున్నాడు.

''అబ్బే. ఇంత చిన్నదానికే ఫీజు ఎందుకమ్మా? బిజినెస్ బిజినెస్సేనా? సరే... ఆ కుర్రోడి వివరాల కవరు పంపిస్తాను'' అని ఫోన్ పెట్టేసి యింకా కార్తికేయ అక్కడ ఉండడం చూసి 'ఏమి'టన్నట్టుగా కళ్ళెగరేశాడు. ''నా ఇంటర్వ్యూ...'' అర్ధోక్తిలో ఆపుచేశాడు కార్తికేయ.

ప్రతాపరెడ్డి కుర్చీ వెనక్కి వాలాడు. మనిషి సంతోషంగా ఉన్నాడు. బహుశా శ్రీకళ్యాణి ఫీజు పంపుతున్నానని చెప్పిన ప్రభావం అయివుంటుంది. కార్తికేయని చూసి ''నీకు ఇంటర్వ్యూనా?'' అని అడిగాడు. కార్తికేయ సమాధానం చెప్పలేదు. ఆయనే అన్నాడు. ''ఎందుకు చెయ్యాలోయ్ నీకు ఇంటర్వ్యూ? ఆఫీసుకొచ్చి ఇక్కడో పాతికమంది జనం ఉండడం చూసి 'కాఫీ' కి వెళ్ళినందుకా?''

'నాకు టైమ్ వాల్యూ బాగా తెలుసని మీరే అన్నారు కదండీ' అనలేదు కార్తికేయ. ఎలాగో ఒకలా ఈ ఉద్యోగం సంపాదించాలి. లేకపోతే రేపట్నుంచీ తిండి ఉండదు. వినయంగా ''ఎక్కువ మంది జనం అప్పటికే బయట హాలంతా పాడుచేస్తున్నారండి. వాళ్ళలో ఎందుకని బయటకెళ్ళి వచ్చాను'' అన్నాడు.

ప్రతాపరెడ్డి మొహంలో భావాలు మారాయి. ''వెరీగుడ్, నువ్వు నాకు నచ్చావ్. వెంటనే జాయినవ్వు'' అన్నాడు. ఈసారి ఆశ్చర్యపోవడం కార్తికేయ వంతయింది. ''వాళ్ళందర్నీ అయిదు నిముషాల్లో పొమన్నాను. ఎందుకో తెలుసా?''

తెలీదన్నట్లు తలూపాడు కార్తికేయ. ''మొత్తమంతా 'కంగాళీ' చేసేశారు. ఎక్కడివక్కడ నీట్‌గా సర్దేశారు. సాలెగూళ్ళు దులిపేశారు. ఇదంతా ఎవరు చేశారని అడిగితే, ఈ ఉద్యోగం కొట్టెయ్యడానికి 'నేనంటే నేను' అని ప్రతి ఒక్కడూ ఉత్సాహపడ్డాడు. అందర్నీ ఒక అరుపుతో గెటౌట్ అని అరిచి పంపించి వేశాను. నన్నడక్కుండా నా ఆఫీసు సర్దుతారా? అన్నీ కెలుకుతారా?''

కార్తికేయ నిశ్శబ్దంగా ఉన్నాడు.

''నువ్వీక్షణం నుంచే ఉద్యోగంలో చేరు. ముందు ఆ ఫ్లాస్క్‌లో కాఫీ పోసివ్వు'' అని, కార్తికేయ కప్పులో కాఫీ పోస్తూండగా ఆయన కొనసాగించాడు. ''...డిటెక్టివ్ ఆఫీసు అందరి ఆఫీసుల్లా ఉంటే కస్టమర్లు రారు. సీక్రెట్ ఏజెంట్స్ ఆఫీసు ఎలా ఉండాలో నాకు స్కాట్‌లాండ్ యార్డులో చెప్పారు. ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ సినిమా సెట్ లా ఉండాలి. అందుకే ఈ సాలెగూళ్ళూ, అస్తవ్యస్తమైన టేబుల్సూ వగైరా. ఒక డిటెక్టివ్ దగ్గరకి కస్టమర్ వచ్చేటప్పుడు ఆ వాతావరణం అతడి మానసిక స్థితికి తగ్గట్టు ఉండాలి కదా...''

'ముందు ఈయన మానసిక పరిస్థితి పట్ల నాకు అనుమానం కలుగుతోంది' మనసులో అనుకున్నాడు కార్తికేయ. గత మూడు రోజులుగా అన్నీ ఇలాంటి కేసులే తగుల్తున్నాయి.

అతడు కాఫీ కప్పు అందించాడు. కప్పు అందుకుంటూ – ''నీకీ ఉద్యోగం ఎందుకు ఇచ్చానో తెలుసా? వాళ్ళలా అనవసరమైన విషయాల్లో వేలు పెట్టలేదు కాబట్టి.''

''థాంక్స్ సర్'' అన్నాడు కార్తీక్. ''... కానీ కనీసం ఈ ఆఫీసుని తుడిచేవారు కూడా ఎవరూ లేరని అనిపించింది సార్. ఉద్యోగం ఎవరికొస్తేనేం, ముందు ఆఫీసు నీట్‌గా చెయ్యాలనుకున్నాను. పక్కనున్న మనిషితో అదే చెప్పాను. క్షణాల్లో అది పాకిపోయి, ఎవరికివారు ఉద్యోగం కోసం ఎగబడి పని చేశారు. మీకిలా 'హారర్ సినిమా' సెట్ లాటి ఆఫీసంటే ఇష్టం అని నేననుకోలేదు. సారీ సార్.''

అప్పటికి ఆయన ఆశ్చర్యం నుంచి తేరుకుని ''ఇవన్నీ చెప్పకపోయి ఉంటే నీకు ఉద్యోగం ఇచ్చి ఉండేవాడిని'' అన్నాడు.

''నేను సాధారణంగా అబద్ధాలు చెప్పను సార్!''

''నా వస్తువులు అటూ ఇటూ మార్చినందుకే వాళ్ళకి ఉద్యోగం లేదు పొమ్మన్నాను. ఆ సలహా ఇచ్చింది నువ్వేనని తెలిశాక నీక్కూడా ఇవ్వను.''

''సరే సార్. మీకేది ఇష్టమైతే అలాగే!''

కార్తికేయ తలుపులు దగ్గరగా వేసి బయటకు నడిచాడు.

రాత్రి పది అయింది. పక్కమీద పడుకుందే గానీ శ్రీకళ్యాణికి నిద్ర పట్టలేదు. ఫోన్ దగ్గరకు లాక్కొని, డయల్ చేయడం ప్రారంభించింది. నిముషం తరువాత అట్నుంచి ప్రతాపరెడ్డి కంఠం 'హల్లో' అని వినిపించింది.

''ఆ సైకియాట్రిస్టు దగ్గర ఉండే అసిస్టెంట్ గురించి కనుక్కోమన్నాను''

''కనుక్కున్నానమ్మా. అతడి పేరు కార్తికేయ.''

''కార్తికే... య్యా? పేరు గమ్మత్తుగా ఉందే''

''ఆ డాక్టరు లేనప్పుడు ఫోన్‌లు ఎత్తేది అతడే. అక్కడే రిసెప్షనిస్టు! తరువాత అక్కడ ఉద్యోగం మానేసేడట...''

''ప్రస్తుతం ఖాళీగా ఉన్నాడా?'' అతడి మాటలు మధ్యలో ఖండిస్తూ అంది.

''అవును. ఇంటి అడ్రసు కూడా తెలుసుకున్నాం. రేపు పంపిస్తాను.''

''అవసరం లేదు కానీ, మీరొక సాయం చెయ్యాలి. మీ దగ్గర చాలామంది డిటెక్టివ్‌లు ఉంటారు కదా. అందులో తనెవరో తెలియనివ్వకుండా జాగ్రత్తగా నాటకం ఆడగలిగే మనిషి ఎవరైనా ఉన్నారా?''

''నా దగ్గర పనిచేసే వాళ్ళందరూ అలాంటి వాళ్ళేనమ్మా.''

''అలాంటి మనిషిని ఒకర్ని తన ఐడెంటిటీ తెలియకుండా కార్తికేయ దగ్గరకి పంపించి ఉద్యోగం ఇవ్వండి. నెలకి పదివేల జీతం మీద...''

ప్రతాపరెడ్డి చేతిలోంచి రిసీవర్ జారిపోయింది.''పదివేలా?''

''ఇచ్చినపుడు కదా''

ప్రతాపరెడ్డి అయోమయంగా ''నాకేమీ అర్థంకావడంలేదు'' అన్నాడు. ఆమె చెప్పడం ప్రారంభించింది. ఏం చెయ్యాలో అన్నీ వివరంగా చెప్పి చివరగా, ''అతడిని అక్కడ అలా వదిలెయ్యాలి'' అంది. ప్రతాపరెడ్డికి షాక్ తగిలినట్టు అయింది. 'ఆ కార్తికేయ ఎవరోగానీ, ఈ అమ్మాయి సంగతి తెలియక ఏదో తప్పు చేసి ఉంటాడు. ఇంత దారుణమైన శిక్ష అనుభవిస్తున్నాడు' అనుకున్నాడు.అట్నుంచి కళ్యాణి అంటూంది. ''ఇలా చేస్తే అతనింకెప్పుడూ ఎవరి మీదా ప్రాక్టికల్ జోకులు వెయ్యడు.''

''ఏం ప్రాక్టికల్ జోకు వేశాడు?'' అన్న ప్రశ్న నోటి చివరి వరకూ వచ్చింది. ఇంకో రెండు పెగ్గులు తాగుంటే అడిగేవాడేమో కానీ, కాస్త విచక్షణ మిగిలి ఉండి తనని రక్షించుకున్నాడు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments